అతని ఆలోచనలు శరత్ మీదకు మళ్ళినయ్. అతను తప్పించుకుని వుంటాడా ఈపాటికి? క్షేమంగా అతనిల్లు చేరుకుని వుంటాడా? అంతలోనే శరత్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చి గుండెలు ఝల్లుమన్నాయి.

"సురేష్! వీళ్ళ చేతుల్నించి తప్పించుకోవటం చాలా కష్టం. ఈ నగరంలో ఏ మూల వున్నా వెతికి ఏరి మరీ చంపేస్తారు. నాకు తెలుసా విషయం. అయినా వీళ్ళ చేతుల్లో ఇక్కడ నిశ్శబ్దంగా చావటం కంటే ఆ రిస్క్ తీసుకోవటం మంచిది. అదృష్టముంటే వాళ్ళకు దొరకకుండా తప్పించుకోవచ్చు...."

మధ్యాహ్నం భోజనం తెచ్చింది విక్కీ. ఆమె భోజనం వడ్డిస్తుంటే వెనక నుంచి వెళ్ళి అమాంతం ఆమెను కౌగలించుకున్నాడు సురేష్. విక్కీ నవ్వి అతనికి అభిముఖంగా తిరిగింది. ఇదరి పెదాలూ కొద్దిక్షణాలపాటు అల్లుకుపోయినయ్.

"సాయంత్రం వరకయినా ఆగాలి సర్! లేకపోతే ఆ నౌఖరుకి తెలిసిపోతుంది" అంది విక్కీ నెమ్మదిగా.

"తెలిస్తే ఏం?"

ఆమె కలవరపడింది "మన విషయం వెంటనే చీఫ్‌కి చెప్పేస్తాడు సర్...అప్పుడు నా వుద్యోగం పోతుంది. నా వుద్యోగం పోగొట్టుకోవటం నాకిష్టంలేదు సర్. ఇంత జీతం, సుఖం ఇంకెక్కడా దొరకదు."

"కానీ సాయంత్రం ఎలా కుదురుతుంది? ఆ నౌఖరు యిక్కడే వుంటాడుగా?"

"అదంతా నేను చూసుకుంటాను సర్. వాడిని ఆరుగంటలకల్లా ఎలా నిద్రపుచ్చాలో నాకు తెలుసు. వాడు నిద్రపోయేందుకు నా దగ్గర మందుంది. సాయంత్రం టీ తాగేప్పుడు యిస్తాను వాడికది" ఆమె వెళ్ళిపోయింది.

సాయంత్రం నాలుగ్గంటలయ్యేసరికి నాలుగు యుగాలు గడిచినట్లుంది సురేష్‌కి. విక్కీ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నాడతను. ఆ నౌఖరికి మందు కలిపిన 'టీ' ఇస్తుందా లేదా? వాడు ఆ మందుకి స్పృహ తప్పుతాడా లేదా? అనే విషయం ధృవపడాలి ముందు.

విక్కీ ట్రేతో లోపలికొచ్చింది.

"టీ తీసుకోండి సర్" అని ఒక పాట్ తన దగ్గరుంచి మరోపాట్ తీసుకుని నౌఖరు దగ్గరకు నడిచింది.

ఆమె చేతుల్నుంచి పాట్ అందుకున్నాడు నౌఖరు. సురేష్ గుండె వేగంగా కొట్టుకోసాగింది. అతనివంకే కళ్ళప్పగించి చూస్తూండిపోయాడు.

అతను 'టీ' కప్పులో పోసుకుని నెమ్మదిగా తాగసాగాడు. సురేష్‌కి ఆతృత పెరిగిపోతోంది.

‘టీ’ తాగటం పూర్తయింది. అతను యధాప్రకారం గార్డెన్ వర్క్ చూసుకోవటం ప్రారంభించాడు. అరగంట గడిచిపోయింది.

సురేష్‌కి మందు మీద నమ్మకం తగ్గిపోతోంది. తన ప్లాన్ నాశనమైపోతుంది వాడు అడ్డు తొలగకపోతే. అప్పుడు పనిచేయటం ప్రారంభించిందా మందు.

పని చేస్తున్నవాడల్లా ఆపి మెత్తని పచ్చిక మీద వెనక్కి వాలాడతను. అతని కళ్ళు మెత్తగా మూసుకుపోయినయ్. మరుక్షణంలో గాఢ నిద్రలోకి వెళ్ళిపోయాడు.

నెమ్మదిగా లేచి కిచెన్ వేపు నడిచాడు సురేష్ . విక్కీ వంటపనిలో నిమగ్న మై వుంది.

“విక్కీ” రహస్యంగా పిలిచాడు. ఆమె అతనివేపు చూసి చిరునవ్వు నవ్వింది.

“మందు పనిచేసిందా సర్?”

“అవును-గార్డెన్‌లోనే పడుకుని నిద్రపోతున్నాడు.”

“ఇంక మనకేం ఫరవాలేదు సర్! రేపు ఉదయం వరకూ మెలకువ రాదు అతనికి.”

ఆమెను కౌగలించుకోబోయాడు సురేష్ .

ఆమె వారించింది “ఇంకొక్క గంట ఓపిక పట్టండి సర్! నేను పనంతా ముగించుకుని రడీ అయి వస్తాను”.

సురేష్ తన గదిలోకొచ్చేశాడు.

టైమ్ చూసుకున్నాడు. ఆరవుతోంది. ఇంకొక్క గంటలో ప్రత్యూష కారు వస్తుంది. కిటికీ కర్టెన్ కొంచెంగా పక్కకు లాగాడతను. ఎదురుగా రోడ్ కనబడుతోంది. చెట్ల మధ్యలో ప్రత్యూష కారు వచ్చి ఆగగానే తనకు కనబడుతుందక్కడినుంచీ.

మంచం మీద పడుకున్నాడు. ఆ కాటేజ్, ఆ నిశ్శబ్దం భయం కలిగించసాగాయ్. చిన్నప్పటినుంచీ చాలామంది జనం మధ్య కిక్కిరిసిపోయిన స్నేహితులూ, బంధువులూ, చుట్టుపక్కలవాళ్ళ మధ్య-హడావిడి జీవితం గడిపాడు తను.

అలాంటిది ఈ కాటేజ్‌లో జీవితాంతం నిశ్శబ్దంగా, ఒంటరిగా గడపగలడా? ఒకవేళ పక్కన తులసి వున్నా సరే! ఇద్దరూ బయటి ప్రపంచంలో స్నేహితులతో సంబంధాలు లేకుండా-

పది లక్షలు యిచ్చినా సరే-తనకీ జీవితం సరిపడదు.

టైమ్ ఆరున్నరయింది. గదిలో చీకటి అలుముకుంటోంది.

ఇంకొక్క అరగంటలో ప్రత్యూష వచ్చేస్తుంది. విక్కీ వచ్చింది. సరికొత్త అలంకరణతో-మరింత ఎక్కువ నగ్నత్వంతో-ఆమె పెదాలమీద నవ్వు మరింత సెక్సీగా, సమీపంగా వచ్చేసి అతని మీదకు వంగిందామె.

అమాంతం ఆమెను తన మీదకు లాక్కున్నాడు సురేష్ . ఇద్దరూ ఒకరిలో ఒకరు ఐక్యం అయిపోతున్నారు. టైమ్ నిశ్శబ్దంగా, వేగంగా నడుస్తోందిప్పుడు.

అయిదు నిమిషాలుంది.

విక్కీ శరీరం మెలికలు తిరుగుతోంది. ఆనందంతో ఏవేవో కలవరిస్తున్నట్లు మాట్లాడుతోంది. అప్పుడు కనిపించింది కారు బయట. నెమ్మదిగా, నిశ్శబ్దంగా వచ్చి ఆగింది రోడ్ మీద.

"విక్కీ! బాత్ రూమ్‌కెళ్ళి వస్తాను" ఆమె కౌగిలి బెడ్ దిగి బాత్‌రూమ్ వేపు నడిచాడతను.

చీకట్లో తడుముకుంటూ కిచెన్‌లో కెళ్ళాడు-గోడకున్న షెల్ఫ్‌లో వుంది కత్తి.

అది తీసుకుని ఆమె గదిలోకొచ్చాడు.

ఆమె అతనివేపు చేతులు చాచింది.

ఆమె ముఖం దగ్గర కత్తి పెట్టాడు సురేష్.

"విక్కీ! అయామ్ సారీ! నేను పారిపోతున్నాను ఈ జైలునుంచి-ఎవరడ్డుకున్నా ప్రాణాలు పోగొట్టుకోవలసిందే! నువ్వు కొద్దిసేపు నిశ్శబ్దంగా వుండటం కోసం నిన్ను మంచానికి కట్టేయక తప్పటంలేదు....".

ఆమె నిర్ఘాంతపోయింది. భయంతో వణికిపోసాగింది.

ఆమె విడిచిన చీర తీసుకుని ఆమె కాళ్లూ చేతులూ కట్టేశాడు. తరువాత మంచం మీద దుప్పటి కత్తి సాయంతో పీలికలు చింపి ఆమె నోట్లో కొన్ని గుడ్డలు కుక్కి తల కదలకుండా మంచానికి కట్టి వేశాడు. ప్రతిఘటన లేకుండా భయంతో చూస్తూండిపోయిందామె.

నగ్నంగా వున్న ఆమె చాతీమీద ముద్దు పెట్టుకున్నాడతను.

"విక్కీ! నిజంగా చెపుతున్నాను. మనం యిక్కడ కాకుండా, మామూలుగా రోడ్ మీదెక్కడో కలుసుకున్నట్లయితే ఈ అవకాశం వదిలేవాడిని కాదేమో-36-26-30 ఈ మెజర్‌మెంట్స్ అవకాశం రావటం నాకిదే ప్రధమం-బహుశా యిదే ఆఖరు కూడా."

త్వరత్వరగా డ్రస్ చేసుకుని బయటకు చీకట్లోకి నడిచాడతను. దారి వదిలేసి చెట్ల చాటునుండి అడుగులో అడుగు వేసుకుంటూ నిశ్శబ్దంగా కారు వేపు సాగాడు.

*　　　　*　　　　*　　　　*

"ఎందుకు కారాపమన్నారు?" అడిగాడు డ్రైవరు ప్రత్యూషను.

"ఉంగరం బయట పడిపోయింది" అంటూ డోర్ తెరుచుకుని రోడ్‌మీద వెతుకుతూ కొంతదూరం వెనక్కు నడిచిందామె.

డ్రైవర్ కూడా తలుపు తెరుచుకుని దిగి తనూ రోడ్ మీద వెతకసాగాడు. టార్చ్ లైట్ వెలుగులో ప్రత్యూష టైమ్ చూసుకుంది వెతుకుతూనే- ఉండుండి సురేష్ కాటేజ్‌వేపు చూస్తోంది. కానీ అంతా చీకటి తప్పితే యింకేమీ కనిపించటంలేదు. టైమ్ ఏడుంపావు అయిపోయింది. ఆమెకు భయం పెరిగిపోతోంది. తనింకెంతసేపో యిలా వెతుకుతూ గడపలేదు. డ్రైవర్‌కి

అనుమానం రావచ్చు.

"ఈ చీకట్లో కనిపించడం కష్టం. రేపు ఉదయం వెతకవచ్చులెండి! ఈ ఎస్టేట్‌లో ఏ వస్తువూ ఎక్కడికి పోదు. ఎవరికి దొరికినా సెక్యూరిటీ దగ్గర యిచ్చేస్తారు. ఇవ్వకపోయినా వాళ్ళు చెక్ చేసి పట్టుకోగలరు."

"ఇంకొంచెంసేపు వెతికి వెళదాం" అందామె.

"సారీ మేడమ్! నా డ్యూటీ టైమయిపోతుంది. మిమ్మల్ని సిటీ తీసికెళ్ళి మళ్ళీ తీసుకొచ్చేసరికే యింకో గంటన్నరవుతుంది".

ఆమెకింకేం మాట్లాడ్డానికి తోచలేదు. ఇంకా లాభం లేదు సురేష్‌ని తను రక్షించటం కల్ల.

ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్. ఈ రాత్రికి తప్పించుకోలేకపోతే చంపేస్తారని చెప్పాడు. ఎంత దారుణం?

హఠాత్తుగా ఓ ఆలోచన ఆమెని వూగించి వేసింది. అవును. తను తిన్నగా పోలీస్‌స్టేషన్‌కెళ్ళి ఈ సంగతంతా చెప్పివేస్తే? ఎగ్జయిట్‌మెంట్‌తో కారువైపు నడవసాగిందామె.

"డ్రైవర్! పద-రేపే వెతుకుదాం లే"

అతను కూడా ఆమె వెంబడే నడిచాడు. కార్లో కూర్చోబోతూండగా ఒక్కసారిగా నిరాశ ఆవహించిందామెని. ఊహు! తను పోలీస్‌స్టేషన్ కెళ్ళటం అసాధ్యం! తను సిటీకెళితే ఎవరోకరు తనను వెంబడిస్తారని, ఎవరితోనూ కలవకుండా మాట్లాడకుండా వాళ్ళు జాగ్రత్త తీసుకుంటారనీ ముందే చెప్పారు. సురేష్ కాటేజ్‌వైపు మరోసారి చూసి కార్లో కూర్చుని డోర్ వేసిందామె. డ్రైవర్ కారు స్టార్ట్ చేశాడు.

అప్పుడు కదిలింది ఓ ఆకారం తన కాళ్ళ దగ్గర.

అదిరిపడి పరీక్షగా చూసిందామె. కెవ్వున కేక వేసింది హడలిపోతూ. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. సురేష్ లేచి నిలబడి డ్రైవర్‌మీదకు వంగాడు. అతని చేతిలో కత్తి డ్రైవర్ మెడకు గుచ్చుకుంటోంది.

"బ్రతకాలని ఆశ వుంటే రెండు చేతులూ పైకెత్తు" అన్నాడు గంభీరంగా.

డ్రైవర్ చేతులు పైకి లేపాడు.

"ప్రత్యూషా! వాడి జేబుల్లో పిస్టలుందేమో చూడు" అన్నాడు సురేష్ . ప్రత్యూష నిశ్చేష్టురాలై చూస్తోందతనిని. తన బాస్ అర్జున్.

అతనిలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో తేలీటం లేదు.

"ప్రత్యూషా! నేను సురేష్‌నే. ముందు వాడి జేబులు వెతుకు"

ప్రత్యూష భయంగా డ్రైవర్ జేబుల్లోనుంచి పిస్టల్ తీసి అతని కిచ్చింది. ఆమెకు భయంగా వుంది అతడిని చూస్తుంటే...

“తను సురేష్‌నంటాడేమిటి?” ఏమీ అర్థం కావటం లేదు. కానీ గొంతు మాత్రం సురేష్‌దే.

పిస్టల్ చేతిలోకి తీసుకుని డ్రైవరు మెడ కానించాడు సురేష్ .

“కారు పోనీ” ఆదేశించాడు అతను.

కారు వేగంగా సెక్యూరిటీ గేట్‌వైపు పోతోంది.

ప్రత్యూష చేతిని తీసుకుని తన పెదాలకు హత్తుకున్నాడు అతను.

“ఏమిటి కొంగా! అలా భయపడుతున్నావు? నేను సురేష్‌నే! డబ్బుకి ఆశపడి యిక్కడి ఉద్యోగానికి వప్పుకున్నాను అర్జున్‌లాగా నటించడానికి, నాకు ప్లాస్టిక్ సర్జరీ చేశారు వాళ్ళు” త్వరత్వరగా చెప్పాడతను.

ప్రత్యూషకింకా నమ్మకం కలగటంలేదు.

“అంటే-మరి అర్జున్....”

“అర్జున్‌ని బంధించి వుంచారు వాళ్ళు-రోజూ ఆఫీసుకొచ్చి నువ్విచ్చే ఫైల్స్‌లో సంతకాలు చేస్తోందెవరనుకున్నావు? నేనే- అందుకే ఆ రోజు తులసి విషయం కనుక్కురమ్మని ఉత్తరం రాసిచ్చాను.”

కారు సెక్యూరిటీ గేట్ దగ్గరకు చేరుకుంది. సురేష్ పిస్టల్ ప్రత్యూష చేతికిచ్చాడు.

“నేను సీటుకింద దాక్కుంటాను. డ్రైవరు నా గురించి సెక్యూరిటీ వాళ్ళకేమయినా చెప్పటానికి ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేయ్.”

ప్రత్యూష వణుకుతున్న చేతులతో పిస్టల్ అందుకుని బారెల్ డ్రైవరు మెడకానించి ముందుకు వంగి కూర్చుంది. డ్రైవరుకి చెమటలు పట్టేస్తున్నాయ్.

ఏ మాత్రం అనుభవం లేని వాళ్ళ చేతిలో పిస్టల్ వుంటే ఏం జరుగుతుందో అతనికి బాగా తెలుసు. ఒకసారి తన భార్య పిస్టల్ ఎలా వుంటుందోనని పరీక్షిస్తూంటే బులెట్ పేలింది. కొంచెంలో తను చావు తప్పించుకున్నాడు.

సెక్యూరిటీ గార్డ్‌కి ఓ.కె. రిపోర్టు యిచ్చి కారు మళ్ళా స్టార్టు చేశాడతను.

పిస్టల్ మళ్ళీ సురేష్ చేతిలోకెళ్ళాక గానీ అతని వణుకు తగ్గలేదు. కారు వేగంతో బంజారాహిల్స్ కొండలమీద నుంచీ ఎత్తులూ పల్లాలూ దిగుతూ చీకట్లో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద నుంచి సిటీ వైపు పరిగెడుతోంది.

“ఆర్ యూ ఆల్‌రైట్?” ప్రత్యూషను తనకు హత్తుకుంటూ అడిగాడు సురేష్.

ఆమె చిన్నగా నవ్వింది “ఇదంతా ఏమిటో-నమ్మశక్యం కావటం లేదు.”

“కథంతా తర్వాత చెప్తానులే-ముందు మనం ఈ గ్యాంగ్ చేతుల్లో పడకుండా తప్పించుకోవటం ముఖ్యం”

కార్ చాలా స్లోప్‌గా ఉన్న పల్లంలోకి జరుతోంది.

"కారాపు" అన్నాడు సురేష్.

డ్రైవర్ బ్రేక్ వేశాడు.

సురేష్ వెనుక డోరు తెరచుకుని దిగి డోరు మూసివేశాడు.

"దిగు" అన్నాడతను డ్రైవరుతో.

డ్రైవరు దిగి నిలబడ్డాడు.

"వెనక్కు తిరిగి వెళ్ళిపో."

అతను వెనక్కు తిరిగి నడవసాగాడు.

సురేష్ డ్రైవింగ్ సీట్లో కూర్చుని కారు స్టార్ట్ చేశాడు. డ్రైవింగ్ కుదరటం లేదు. భయం, టెన్షన్ పెరిగిపోతున్నాయ్. నెమ్మదిగా నడపసాగాడతను.